RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



C I T I Z E N   T I M E S   T E L U G U   D A I L Y

సంపుటి :18 | సంచిక : 294 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 30-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 294 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 30-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం..

## రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం

ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

**పాడేరు, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు తరువాయి 2లో..






### నేపాల్‌కు చైనా వరద హెచ్చరిక

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హిమానీనదం బద్దలై ఇప్పటికే నేపాల్‌లో వరదలు రాగా.. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఏర్పడిన సరస్సు పొంగుతోంది. దానిపై చైనా మరోసారి హెచ్చరిక చేసింది. ఏ క్షణాన అయినా అది ఉప్పొంగి, కిందికి దూసుకురావొచ్చని పేర్కొంది. నీటి రంగులో మార్పును అందుకు కారణంగా చెప్పింది. నేపాల్ విదేశాంగశాఖతో ఈ సమాచారాన్ని షేర్ చేసుకుంది. "విపత్తు తర్వాత ఏర్పడిన సరస్సు రంగు మారుతోంది. ముదురురంగులోకి వస్తోంది. అంటే అది బద్దలయ్యేందుకు అవకాశం ఉంది" అని చైనా అధికారులు వెల్లడించారు.

**అది వరదలకు సూచనే..:** నది లేక ఇతర వనరుల్లో నీటి రంగు మారడం అనేది వరదలు వచ్చేముందు ప్రధానంగా తరువాయి 2లో..

## గత ప్రభుత్వానికి నరకడం తప్ప

## నాటే ఆలోచనే రాలేదు

ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం

మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు

హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు

రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

**మంగళగిరి**

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం తరువాయి 2లో..



## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై

## ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

## నాణ్యతా లోపాలే కారణం

ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల ఇంగువ అమ్మకాలపై నిషేధం

నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేల్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ


నమూనాల్లో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తింపు

కంపెనీల ముడిసరుకులోనూ నాణ్యత లోపాలు ఉన్నాయని వెల్లడి

దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు సంస్థలకు స్పష్టమైన ఆదేశం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రముఖ మసాలా దినుసుల బ్రాండ్లు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు సంస్థలు విక్రయిస్తున్న కాంపౌండెడ్ ఇంగువ (హింగ్ పౌడర్) నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలడంతో, వాటి తరువాయి 2లో..




## ఏపీలో మెడికల్ కోర్సుల ఫీజుల పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన వైద్యారోగ్యశాఖ!

ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

పీజీ కోర్సుల ఫీజు 15 శాతం పెంపు

2026-27 విద్యాసంవత్సరానికి వర్తించనున్న ఫీజులు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్య (మెడికల్) కోర్సుల తరువాయి 2లో..

## రాష్ట్రాన్ని నాశనం చేయడమే జగన్ సంకల్పం

జగన్ చేసిన విధ్వంసాన్ని రాష్ట్ర ప్రజలు భరించలేకపోయారన్న రామ్మోహన్ నాయుడు

రాజకీయ పబ్బం గడుపుకోవడానికే మీడియా ముందుకు వస్తున్నారని విమర్శ

ఏపీని నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కొనసాగించిన విధ్వంసాన్ని భరించలేకే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆ పార్టీని దారుణంగా ఓడించారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమర్శించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమే జగన్ ఏకైక సంకల్పమని... అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించే సత్తా లేక కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే తరువాయి 2లో..

## తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర..

ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ

సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం

ఇంటర్ పాసైన వారు అర్హులు,

ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక

ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ

రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ



**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని తరువాయి 2లో..

## ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు..

## నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

నేపాల్-టిబెట్ సరిహద్దులో కృత్రిమంగా ఏర్పడిన సరస్సుపై చైనా హెచ్చరిక

హిమనీనదం కూలడంతో ఏర్పడిన సహజ ఆనకట్టతో మరో ప్రమాద ఘంటికలు

సరస్సు నీటిమట్టం తగ్గడంతో తాత్కాలికంగా తగ్గిన తక్షణ ముప్పు

ఇప్పటికే వందల మంది మృతి, వెయ్యికి పైగా గల్లంతు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

డ్రోన్లు, శాటిలైట్లతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. అయితే, తాజా అంచనాల ప్రకారం తక్షణ ముప్పు కాస్త తగ్గిందని, పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని కూడా వారు వెల్లడించారు. బుధవారం తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# బీజేపీకి దూరం అవుతున్న విశాఖ ?

విశాఖ అంటేనే బీజేపీ అన్నట్లుగా ఒకప్పుడు పరిస్థితి ఉండేది. గట్టిగా చెప్పాలీ అంటే తెలంగాణాలో బీజేపీ ఇంకా బలపడని రోజులలో ఆ మాటకు వస్తే దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీకి గేట్ వేగా సింహద్వారం తెరచినది విశాఖలోనే. 1981లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విశాఖ అప్పటిదకా మున్సిపాలిటీగా ఉండేది ఒక్కసారిగా కార్పొరేషన్ గా పదోన్నతి పొందింది. ఆ విధంగా తొలి కార్పోరేషన్ అయిన విశాఖలో జెండా ఎగరేసింది బీజేపీ. ఆనాడు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది. కాంగ్రెస్ ని ఎదిరించి మరీ విశాఖ కార్పోరేషన్ ని గెలుచుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ ఈ ఫీట్ ని ఎంతో సమర్ధంగా సాధించి బీజేపీ తొలి మేయర్ పదవిని అందుకుంది. అప్పట్లో బీజేపీకి జాతీయ అధ్యక్షుడుగా ఉన్న అటల్ బిహారీ వాజ్ పేయి ప్రత్యేకంగా విశాఖలో మకాం వేసి మరీ ఎన్నికల వ్యూహాలు రచించి బీజేపీని గెలిపించారు అంటే ఆశ్చర్యంతో పాటు ఆసక్తి కూడా కలుగుతుంది. ఒక కార్పోరేషన్ కోసం జాతీయ ప్రెసిడెంట్ రావడం అంటే మామూలు విషయం కానే కాదు అని అంటారు. కానీ బీజేపీ మాత్రం దక్షిణాదిన పాగా వేయాలనుకుంది. దానికి విశాఖనే రాజ మార్గంగా ఎంచుకుంది. అలా బీజేపీ విశాఖలో వికసించింది కానీ ఏపీలో గడచిన యాభై ఏళ్ళుగా ఎన్నడూ అధికారానికి దరి దాపుల్లో కాదు కానీ పట్టు పని పది ఎమ్మెల్యే సీట్లు కూడా గెలుచుకోలేకపోయింది. అయితే వాజ్ పేయి ఆనాడు విశాఖలో బీజేపీ ఎదుగుదలకు వేసిన బలమైన పునాదుల మీదనే ఆ పార్టీ ఈ రోజు దాకా అలా నిలబడి ఉంది అన్నది వాస్తవం. బీజేపీ ఈ క్రమంలో తరువాత జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో విడిగానూ పొత్తులలోనూ కొన్ని డివిజన్లు గెలుచుకుంటూ తన సత్తా చాటుతూ వస్తోంది. పొత్తులు లేకపోయినా 2021లో ఒక కార్పోరేటర్ ఆ పార్టీ నుంచి గెలిచారు అంటే ఎంతో కొంత బలం ఉన్నట్లుగానే లెక్క. ఇక ఎమ్మెల్యే ఎంపీ పదవులు కూడా ఇక్కడ నుంచి బీజేపీ దక్కించుకుంది. విశాఖలో బీజేపీ బలపడడానికి కారణం మధ్యతరగతి వర్గాలు అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు మినీ ఇండియాగా విశాఖ ఉండడం, ఇతర రాష్ట్రాలకు చెందిన జనాలు ఎక్కువగా ఉండడం వారికి బీజేపీ జాతీయ పార్టీగా బాగా అభిమానం ఉండడంతోనే సాధ్యపడింది. ఇదిలా ఉంటే ఎపుడు పొత్తు ఉన్నా విశాఖ ఎంపీ సీటు బీజేపీ పట్టు బట్టి మరీ సాధించేది. అలాగే ఒకసారి గెలుచుకుంది కూడా. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం విశాఖ సీటు బీజేపీ కోరినా టీడీపీ ఇవ్వలేదు. దానికి బదులుగా అనకాపల్లిని కేటాయించింది. దాంతో బీజేపీలో కొంత నిరాశ ఏర్పడింది. విశాఖ నుంచి పోటీ చేయాలని భావించిన మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు లాంటి వారికి కూడా ఇది ఆశాభంగంగా మారింది. ఇక ఇపుడు బీజేపీ మరోసారి విశాఖ మీద తన పట్టుని నిరూపించుకోవాలని చూస్తోంది. దాని కోసం చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేస్తూ వస్తోంది. పొత్తులలో భాగంగా మేయర్ సీటుని తమకు కేటాయించాలని బీజేపీ కోరుతోంది అని అంటున్నారు. తొలి మేయర్ గా గెలిచిన ట్రాక్ రికార్డుని కూడ బీజేపీ ఈ సందర్భంగా చెబుతోంది. దాంతో పాటు విశాఖలో తమ పట్టు జారకుండా ఉండాలంటే మేయర్ పీఠం తమ ఆధీనంలో ఉండాలని కోరుకుంటోంది. అయితే టీడీపీ విశాఖ మేయర్ సీటుని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదని అంటున్నారు. ఏపీలోనే అతి పెద్ద కార్పోరేషన్ ని ఎలా వదులుకుంటారు అని కూడా చర్చ సాగుతోంది. పైగా విశాఖ చుట్టూ అభివృద్ధి అంతా సాగుతున్న వేళ టీడీపీ నుంచి మేయర్ సీటు బీజేపీకి వెళ్లడానికి నో చాన్స్ అని అంటున్నారు. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విశాఖ వాసి కావడంతో పాటు ఎంపీ సీటు ఎటూ ఇవ్వలేదు కాబట్టి మేయర్ ఇవ్వాలని బీజేపీ నుంచి ఒత్తిడి ఉన్న నేపథ్యంలో ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం..

# రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ తంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నీరు రంగుమారుతోంది..

కనిపించే సూచన. పర్వత ప్రాంతాలు, నీటి వనరులకు ఎగువభాగంలో భారీ వర్షాలు కురిసినప్పుడు.. అక్కడి నుంచి కిందికి ప్రవహించే నీటిలో మట్టి, రాళ్లు, ఇసుక, ఆకులు, ఇతర వ్యర్థాలు కొట్టుకొస్తుంటాయి. దాంతో నీటి రంగులో మార్పు వస్తుంటుంది. అంటే ఎగువ నుంచి నీటి ప్రవాహం ఉందని అర్థం. అలాగే వరద ముంచుకొచ్చే ముందు నదీ ప్రవాహ శబ్దంలో కూడా మార్పు వస్తుందని నిపుణులు చెప్తుంటారు. ఇలాంటి సమయాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తారు. ఇప్పుడు చైనా (జష్ట్రఅఖు) అధికారులు కూడా లోతట్టు ప్రాంత ప్రజలకు ఇలాంటి సూచనలే చేశారు. చైనా వైపున చోచెన్ నది, నేపాల్ వైపున పురెపు నది కలిసే దగ్గరలో ఈ సరస్సు ఏర్పడింది. అందులోని నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. శు క్రవారం నాటికి.. సుమారు 25 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరింది. సరస్సు తెగితే (ఝుఎవ ఎబతీర్ం) సంభవించే నష్టాన్ని అంచనా వేయడానికి చైనా ఫ్లడ్ మోడలింగ్ అధ్యయనం చేపట్టింది. ఈ సరస్సు గట్టులో కొంతభాగం తెగితే.. నీటి ప్రవాహం గరిష్ఠంగా సెకనుకు 500 క్యూబిక్ మీటర్లు ఉండొచ్చు. అయితే ఆ పరిమాణం నది ఒడ్డుకే పరిమితమై ఉంటుందని పేర్కొనడం కాస్త ఊరటనిచ్చే విషయం. శు క్రవారం ఆ సరస్సు ఉప్పొంగి.. లెండేఖోలా, త్రిశూలీ నదుల్లోకి ప్రవహించింది. తర్వాత ఆ ప్రవాహ తీవ్రత అదుపులోకి వచ్చిందని చైనా మీడియా వెల్లడించింది. డ్రోన్లు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా డ్రాగన్ ఈ లెక్కలు చెప్తోంది.

## గత ప్రభుత్వానికి నరకడం తప్ప

# నాటే ఆలోచనే రాలేదు

మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి–వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

అమ్మకాలపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006 ప్రకారం ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. మార్కెట్‌లో నిరంతర నిఘా, చట్టపరమైన నమూనాల సేకరణ అనంతరం జరిపిన పరీక్షల్లో ఈ రెండు కంపెనీల ఇంగువ ఉత్పత్తులు నాణ్యత తక్కువగా (సబ్–స్టాండర్డ్) ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో తప్పుడు బ్రాండింగ్ (మిస్‌బ్రాండెడ్) లేదా కల్తీకి గురైనట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

**ఎవరెస్ట్ ఉత్పత్తుల్లో తీవ్ర లోపాలు**

ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ విక్రయిస్తున్న ఇంగువ పొడి, దాని వేరియంట్లలో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఒక నమూనాలో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ నిబంధనల ప్రకారం కనీసం 5 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 0% ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. అదేవిధంగా, ఎవరెస్ట్ యెల్లో హింగ్ పౌడర్‌లో 3.29%, బ్లాక్ హింగ్ పౌడర్‌లో 4.4 శాతం మాత్రమే ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో కూడా ఈ కంపెనీకి చెందిన చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ వంటి ఉత్పత్తుల లేబులింగ్‌లో లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తుచేసింది.

**లాల్జీ గోధూ ఇంగువలోనూ అదే పరిస్థితి**

లాల్జీ గోధూ కంపెనీకి చెందిన పొడి, గడ్డల రూపంలో ఉన్న ఇంగువ నమూనాలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, ఇంగువ తయారీకి ఉపయోగించే ముడిసరుకులోనూ అధికంగా స్టార్చ్ (పిండి పదార్థం) ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇంగువలో స్టార్చ్ ఒక శాతానికి మించి ఉండకూడదు. మార్కెట్‌లో సేకరించిన పలు బ్యాచ్‌ల నమూనాల్లో ఈ ఉల్లంఘనలు విస్తృతంగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీలు తమ ఇంగువ ఉత్పత్తుల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. తమ ఉత్పత్తుల్లోని లోపాలను సరిదిద్దడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఇకపై కేవలం నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారుచేసి విక్రయించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

## ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో వేడుకలు

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు29**

నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ భాషా సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి జయంతిని స్మరించుకుంటూ ప్రతి ఏటా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగు అధ్యాపకులు డాక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు మదన్ మోహన్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి వ్యవహారిక భాషా ఉద్యమానికి పితామహుడని, తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు భాష పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల పూలతో పెద్ద అక్షరాల్లో తెలుగు అని ఆకట్టుకునేలా రూపొందించారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాష ప్రాముఖ్యతపై ప్రసంగించడంతో పాటు పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యా సమన్వయకర్త




అంజయ్య, ఐక్యూఏసి సమన్వయకర్త వనిత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉమాదేవి, అధ్యాపకులు కోదండరాములు, రామకృష్ణ, శైలజతో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మొదటి పేజీ తరువాయి

# తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర..

నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్–1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్–2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ఏపీలో మెడికల్ కోర్సుల ఫీజుల పెంపు

ఫీజులను ప్రభుత్వం సవరించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ఫీజులను 10 శాతం, పీజీ కోర్సుల ఫీజును 15 శాతం పెంచుతూ వైద్యారోగ్యశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంచిన రుసుములు 2026–27 విద్యాసంవత్సరానికి వర్తించనున్నాయి.

**ఎంబీబీఎస్ (వీదీదీూ) ఫీజులు:**

కన్వీనర్ కోటా: రూ. 18,150
మేనేజ్‌మెంట్ కోటా: రూ. 14.52 లక్షలు
ఎన్నారై కోటా: రూ. 43.56 లక్షలు

**బీడీఎస్ (దీణూ) ఫీజులు:**

కన్వీనర్ కోటా: రూ. 15,730
మేనేజ్‌మెంట్ కోటా: రూ. 4.84 లక్షలు
ఎన్నారై కోటా: రూ. 14.52 లక్షలు

**పీజీ – సూపర్ స్పెషాలిటీ కోర్సుల ఫీజులు:**

పీజీ కన్వీనర్ కోటా: రూ. 5.71 లక్షలు
పీజీ మేనేజ్‌మెంట్ కోటా: రూ. 11.42 లక్షలు
పీజీ ఎన్నారై కోటా: రూ. 66.12 లక్షలు
సూపర్ స్పెషాలిటీ కోర్సులు: రూ. 19.38 లక్షలు.

# రాష్ట్రాన్ని నాశనం చేయడమే జగన్ సంకల్పం

మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించడానికి ఎంతో అవకాశం ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు జగన్ ఎందుకు రావడం లేదని రామ్మోహన్ నాయుడు నిలదీశారు. తన పార్టీ నేతలకు ఒక డైరెక్షన్ ఇవ్వడం కోసం, ఉనికిని కాపాడుకోవడం కోసమే ఆయన మాట్లాడుతున్నారని... కానీ, ఆయన చేస్తున్న విమర్శల్లో ఏ ఒక్కదానికి నేటికీ ఆధారాలు చూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రాకూడదని, ఏ ఒక్కరూ బాగుపడకూడదనే దుర్బుద్ధితోనే జగన్ ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కొండంత అండగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దానిని ఖచ్చితంగా సాధించి తీరతామని ధీమా వ్యక్తం చేశారు.

## ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు..

# నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

అత్యంత ఎత్తులో ఉన్న ఒక హిమనీనదం విస్ఫోటనం చెందడంతో ఈ ప్రళయం సంభవించింది. ఈ దుర్ఘటనలో భారీగా రాళ్లు, మంచు, బురద కొట్టుకువచ్చి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ఈ సహజ ఆనకట్ట ఏర్పడింది. దీనివల్ల గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్, భోటే కోశి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు ఒక సందేశం పంపారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సంకేతం కావచ్చని పేర్కొన్నారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే, సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవాహం ఉండవచ్చని, ఇది నది గట్లకే పరిమితం అవుతుందని తెలిపారు. అయితే, ఆ తర్వాత చైనా అధికారులు మరో తాజా సమాచారం అందించారు. సరస్సు ఉపరితల వైశాల్యం తగ్గిందని, దీంతో వరద ముప్పు కాస్త తగ్గిందని వారు స్పష్టం చేశారు. ఈ అంచనాతో తాత్కాలికంగా నిలిపివేసిన సహాయక చర్యలను పునఃప్రారంభించారు. అధికారులు డ్రోన్లు, శాటిలైట్ల సహాయంతో పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారు. దీనికి ఎగువన మరో పెద్ద నీటి వనరును కూడా గుర్తించి, దాని కదలికలను కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈ విపత్తు కారణంగా సరిహద్దుకు ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. మృతుల్లో చాలా మంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మళ్లీ వరదలు రావచ్చన్న ఆందోళనల మధ్య సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

# అధికారుల బోర్డుకే ఎసరు..

# గెడ్డవాగు కబ్జాలో బరితెగింపు!

### వెంకటాపురంలో సర్వే నంబర్లు 196/5, 184/16 స్థలాలు ఆక్రమణ

### వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పదంటున్న గ్రామస్థుల ఆగ్రహం




**ఆనందపురం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో గెడ్డవాగు ఆక్రమణ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. సర్వే నంబర్లు 196/5, 184/16లలోని వాగు స్థలాన్ని కొందరు కబ్జా చేస్తుండటంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ యంత్రాంగం అక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. అయితే, ఆక్రమణదారులు ఏకంగా అధికారిక బోర్డునే తొలగించి పారేసి, బరితెగించి కబ్జా పర్వాన్ని కొనసాగిస్తున్నారు.

**సహజ ప్రవాహాన్ని మింగేస్తున్న కబ్జాదారులు**

ప్రభుత్వ నిబంధనలను, అధికారుల హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయకుండా ఆక్రమణదారులు యథేచ్ఛగా వాగు భూమిని చదును చేస్తూ తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. వాగు సహజ ప్రవాహ మార్గాన్ని మూసివేసి పక్కాగా హద్దులు మార్చే ప్రయత్నం చేస్తుండటంతో రానున్న వర్షాకాలంలో పరిసర పంట పొలాలు, నివాస ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రకృతి సంపద అయిన



వాగును మింగేస్తూ, ప్రభుత్వ ఆస్తులకే ఎసరు పెడుతున్న వారిపై రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, సమగ్ర సర్వే నిర్వహించి గెడ్డవాగును కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## విమానాశ్రయ కార్మికులకు న్యాయం చేయాలి

### 300 కుటుంబాలను రోడ్డున పడేయడం సమంజసం కాదు

### తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలి

### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29**

విశాఖ విమానాశ్రయంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న కార్మికులను రోడ్డున పడేయడం దారుణమని, వారికి తక్షణమే పరిహారం అందించి న్యాయం చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల ఆందోళన 13వ రోజుకు చేరినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. దాదాపు 300 మంది ఎయిర్‌పోర్టు కార్మికుల సమస్యపై మాట్లాడలేని నారా లోకేష్ భవిష్యత్తులో రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారని ఆయన ప్రశ్నించారు.

**ప్రభుత్వ వైఖరిపై విమర్శలు..:**

రెండున్నర దశాబ్దాలుగా విమానాశ్రయంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయి భరోసా కల్పించేలా ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరపాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిర్లక్ష్య వైఖరిని వీడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని బి.వి.రామ్ స్పష్టం చేశారు.

## ఉమ్మడి విశాఖ జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపికలు

### గొట్టిపల్లి న్యూ లైఫ్ స్కూల్ మైదానంలో మధ్యాహ్నం 12 గంటలకు ట్రయల్స్

### ఎంపికైన క్రీడాకారులు సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం



**ఆనందపురం – సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా బేస్‌బాల్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వై. భానుజీరావు తెలిపారు. ఆనందపురం మండలం గొట్టిపల్లిలోని న్యూ లైఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో ఈ ఎంపిక ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానుంది. ఆసక్తి, నైపుణ్యం ఉన్న జిల్లా క్రీడాకారులు సకాలంలో మైదానానికి చేరుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం**

ఈ ట్రయల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు సెప్టెంబరు 12, 13, 14 తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లాలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా తరఫున బరిలోకి దిగుతారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగేందుకు ఇదొక చక్కటి వేదికని నిర్వాహకులు పేర్కొన్నారు.

**హాజరు కావాల్సిన నిబంధనలు**

ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన పురుష, మహిళా క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు సంబంధిత పత్రాలతో మధ్యాహ్నం 12 గంటల సమయానికి పాఠశాల ప్రాంగణంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ ఎంపికలకు సంబంధించిన పూర్తి సమాచారం, ఇతర సందేహాల కోసం ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీని 6305326549 నంబరులో సంప్రదించవచ్చని నిర్వాహక వర్గం వెల్లడించింది.

## అభివృద్ధి పనులు, రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

మధురవాడ జోన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శనివారం మధురవాడ జోనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రానున్న మున్సిపల్ ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు, జోన్ అభివృద్ధి, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల పురోగతిపై జోనల్ కమిషనర్ ఇప్పి నాయుడు, ఇతర అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ జోన్లు, రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్‌మెంట్ బకాయిల వసూళ్లను ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. అలాగే సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా జీవీఎంసీ పరిధిలోని పెండింగ్ కోర్టు కేసులను



సామరస్యంగా పరిష్కరించుకునేలా కార్యాచరణ చేపట్టాలని, పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్ర కుమార్, ఈఈ వెంకట వాసు, ఏసీపీ గౌరు, ఏఎంఓహెచ్ రాజా రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వేములవలసలో ఇంటింటికీ కూటమి సంక్షేమ ఫలాలు



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

ఆనందపురం మండలం వేములవలసలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించాయి. మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందేలా చూడటంతో పాటు రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నాయకత్వంలో భీమిలి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని నవీన్ జానేశ్వర్ పేర్కొన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ప్రభుత్వ పథకాలు, లబ్ధి ప్రతి సామాన్యుడికీ నేరుగా చేరేలా పార్టీ శ్రేణులు నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## గుడిలోవ విజ్ఞాన విహార్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**ఆనందపురం, ఆగస్టు 29 (సిటిజన్ టైమ్స్)**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందపురం మండలం గుడిలోవలోని విజ్ఞాన విహార్ పాఠశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా విద్యార్థుల్లో మాతృభాష పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించేందుకు ప్రాచీన, ఆధునిక కవులు, సాహితీవేత్తల జీవిత విశేషాలతో ప్రత్యేక చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను శ్రీ సరస్వతి విద్యా విహార్, విజ్ఞాన విహార్ పాఠశాలలకు చెందిన సుమారు 900 మంది విద్యార్థులు తిలకించారని ప్రిన్సిపాల్ జానకీదేవి తెలిపారు. మాతృభాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశాఖలో పలు ప్రాంతాలకు 31న తాగునీటి సరఫరా బంద్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29**

రైవాడ మంచినీటి సరఫరా పథకం ప్రధాన పైపులైన్ మరమ్మతులు, అనుసంధాన పనుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆగస్టు 31న తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీరు ఎం. పల్లంరాజు తెలిపారు. నరవ నుంచి టీఎస్ఆర్‌కు సరఫరా చేసే 1000 ఎంఎం ప్రధాన పైపులైన్‌కు బిర్లా జంక్షన్, కంచరపాలెం జాతీయ రహదారి, పీడబ్ల్యూడీ పంప్‌హౌస్ వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో పైపులైన్ అనుసంధానం, మార్పిడి పనులతో పాటు పద్మనాభపురం ట్యాంక్ వద్ద వాల్వ్ మార్పిడి పనులు చేపట్టనున్నారు. ఈ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. దీని ప్రభావంతో ఈస్ట్ జోన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేద్కర్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, రామకృష్ణనగర్, లలితనగర్ తదితర ప్రాంతాల్లోనూ, వెస్ట్ జోన్ పరిధిలోని శ్రీరామనగర్, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, ఆర్.ఆర్.వి.పురం రజక కాలనీ పరిసరాల్లోనూ నీటి సరఫరా నిలిచిపోనుంది. అలాగే నార్త్ జోన్ పరిధిలోని మర్రిపాలెం, మాధవధార, కళింగనగర్, బాపూజీనగర్, శాంతినగర్, సంజీవయ్యనగర్, కప్పరాడ, జయప్రకాశ్‌నగర్, గొల్ల కంచరపాలెం, నందగిరినగర్ సహా పలు ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడనుంది. ఈ పనుల దృష్ట్యా ప్రజలు ముందుగానే అవసరమైన తాగునీటిని నిల్వ చేసుకోవాలని, జీవీఎంసీకి సహకరించాలని అధికారులు కోరారు.

## విశాఖలో పచ్చదనం పండుగ

### మిద్దె తోటలతోనే ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

విశాఖపట్నాన్ని మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఎండాడ జీవీఎంసీ పార్కులో వనమాలి, సిటిజి, మన కూరగాయల తోట సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయ మొక్కలు, విత్తనాల మార్పిడితో పాటు వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో కూరగాయల మొక్కలు పెంచుకోవడం ద్వారా పరిసరాల ఉష్ణోగ్రతలను దాదాపు రెండు డిగ్రీల వరకు తగ్గించవచ్చని, ప్రకృతి సిద్ధమైన పంటలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వనమాలి, సిటిజి ప్రతినిధుల సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ క్లైమేట్ టీమ్ తరఫున దేశీయ వంకాయ, పచ్చిమిర్చి, టమాటా, బంతి నారును పంపిణీ చేశారు. స్థానిక నిర్వాహకులు కవిత, ఉషల పర్యవేక్షణలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పరస్పరం విత్తనాలు, మొక్కలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం వందేళ్ల నాటి మహా వృక్షానికి విత్తనాల రాఖీని కట్టి వృక్షాబంధన్ నిర్వహించి ప్రకృతి పట్ల తమకున్న నిబద్ధతను చాటుకున్నారు.



*తమిళనాడు గవర్నర్ గా నియమితులైన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.*

# పీఎం శ్రీ పాఠశాలలో వైభవంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు

## విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేలా పలు పోటీలు

## మాతృభాషను పరిరక్షించుకుంటూనే, క్రీడల్లో రాణించాలి: ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీనారాయణ




**పుల్లలచెరువు – సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29**

స్థానిక పుల్లలచెరువు మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మాతృభాషా వైభవాన్ని చాటడంతో పాటు క్రీడల ప్రాధాన్యతను తెలియజేసేలా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

**ఉత్సాహంగా సాగిన పోటీలు**

ఈ దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్, చిత్రలేఖనంతో పాటు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని తమ సృజనాత్మకతను, క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు పాఠశాల తరఫున బహుమతులు, ప్రశంసా పతకాలు అందజేశారు.

**సంస్కృతికి మూలం మాతృభాష**

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనం, ప్రాచీన సంస్కృతి, సాహిత్యాలలో మన భాషకు ఉన్న విశిష్ట స్థానాన్ని విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించి, దాని పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**క్రీడలతో శారీరక, మానసిక వికాసం**

విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని లక్ష్మీనారాయణ సూచించారు. నిత్యం క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ఈ వేడుకల్లో పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఎం. కోటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# తాడూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## అర్హులకు కార్డులు అందజేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 29**

తాడూర్ మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, స్మార్ట్ రేషన్ కార్డులతో లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

పట్టణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురపాలక సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది మధ్య క్రికెట్ పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ, వరుసగా మూడు ఒలింపిక్స్‌లలో భారత్‌కు స్వర్ణ పతకాలు అందించిన హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ఆయన సేవలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత క్రీడా పురస్కారానికి ఆయన పేరు పెట్టిందని గుర్తుచేశారు. నేటి యువత ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వి. అనిల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు పాలకవర్గ సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనంలోకి జనసేన- ఇంటింటికి జనసేన



**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశం ప్రకారం రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రచార ,కార్యక్రమంలో భాగంగా శనివారం జెండా వీధి,14, వ వార్డు లో జనసైనికులు , వీర మహిళలు స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీ ప్రచార కార్యక్రమం .ఈ కూటమి తరపున ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ,పరిష్కార మార్గాలు తెలియ జేయుచూ, కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

# ఓటు హక్కు పరిరక్షణే బీజేపీ లక్ష్యం: బైరి శంకర్



**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 29:**

హుస్నాబాద్ పట్టణంలో ఎస్ఐఆర్ రెండవ విడత కార్యక్రమంపై అసెంబ్లీ స్థాయి బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2ల అవగాహన సమావేశం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, విశిష్ట అతిథిగా ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జి కటకం ఆంటోనీ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన భారత పౌరుడి ఓటు హక్కును కాపాడటమే బూత్ స్థాయి కార్యకర్తల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో పేర్లు లేనివారు, నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందకుండా నిబంధనల ప్రకారం పత్రాలు సమర్పించి ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జోనల్ ఇన్‌చార్జి కటకం ఆంటోనీ రెడ్డి మాట్లాడుతూ, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దాఖలు, 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పుల ప్రక్రియపై నాయకులకు, బీఎల్ఏ-2లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఓటర్ జాబితాలో చేర్పించేలా ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు విభూషణ్ రెడ్డి, వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి పృథ్వీరాజ్, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగు భాషాభి వృద్ధి ప్రదాత గిడుగు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

దివంగత గిడుగు వెంకట రామమూర్తి163 వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరూరు లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. విన్నా నరసింహ స్వామి అధ్యక్షత వహించి, ప్రజలు గ్రాంధిక భాష అర్థం కాక ఎన్నో ఇబ్బందులు పడుతున్న కాలంలో రామమూర్తి వాడుక భాషా విధానాన్ని చేపట్టి సామాన్య ప్రజలు సైతం తెలుగును చదవడం, వ్రాయడాన్ని అలవాటు చేసారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణ మూర్తి మాట్లాడుతు గిడుగు రామమూర్తి గారు ఉపాధ్యాయుడిగా, బహు భాషా కోవిధుడుగా పేరు పొందడమే కాకుండా తెలుగు పత్రిక ను స్థాపించారని, తెలుగు భాషను పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు డా.బాలస్వామి మాట్లాడుతు ఈయన శాసనాల పరిశోదకుడిగా, హేతువాదిగా, వాడుక భాష ఉద్యమకారుడిగా 35 ఏళ్ల పాటు ఉద్యమాన్ని నడిపిన యోధుడు గిడుగు రామమూర్తి అని తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడుతు మద్రాసు ప్రెసిడెన్సీ వారు రామమూర్తి కి రావు బహదూర్ బిరుదును ఇచ్చి సత్కరించ్చిందని చెప్పారు. తెలుగు సబ్జెక్టుగా వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించినవారు ఉన్నారని, నేడు సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో తెలుగు ఒక ఆప్షనల్ గా ఉందని, మాతృభాష నేర్చుకోవడం ద్వారా ఇతర భాషలపై పట్టు సాధించవచ్చు అని చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ కరుణశ్రీ తెలిపారు.తెలుగు విభాగధిపతి పి శైలజ మాట్లాడుతు తెలుగు భాష తేనె కంటే తియ్యనిది, పాలు కన్నా కమ్మనిదని, చక్కని లిపి కలది, తెలుగు భాష తల్లిపాల వలే స్వచ్ఛమైనదని, అమృత తుల్యమైనదని, అజంత



భాషఅని, అనేక ప్రక్రియలు తెలుగు భాషలో ఉన్నాయని, అష్టావధానం తెలుగు కు మాత్రమే సొంతమైన ఒక విశిష్ట ప్రక్రియ అని తెలుగును అధ్యయనం చేయడంలో ఏమరపాటు ఉండరాదని తెలియజేస్తూ గిడుగు వారి భాష సేవనులను కొనియాడారు.

గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవ , సవర భాషకు లిపి ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఎన్నదగినదని వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ పి. పి చంద్రబోస్ ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం లో నాగరాణి, మురళీ కృష్ణ, నాగేశ్వరావు, వెంకటేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పద్య ధారణ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయబడిందని ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలే ధ్యేయం

## కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్




**కాకినాడ .సిటిజన్ టైమ్స్ గస్టు 29**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ హాలు లో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జిజిహెచ్) అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, స్థానిక శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు (కొండ బాబు)లతో కలిసి ఆసుపత్రి అభివృద్ధి పనులు,మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. తొలుతగా గత సమావేశపు మినిట్స్ పై తీసుకున్న చర్యలను సమీక్షించారు ఈ సందర్భంగా లిఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ...లి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆసుపత్రి కి అవసరమైన నిధులు, పరికరాలు మంజూరు చేయించేందుకు ప్రతిపాదన లు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి సూచించారు. సెక్యూరిటీ సిబ్బందికి అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు చెల్లించేలా ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని, మెడికల్ విద్యార్థుల పీజీ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ....ఆసుపత్రి లోని మౌలిక వసతులు, వైద్య పరికరాలు,సిబ్బంది కొరత, భద్రత, పారిశుధ్యం మరియు సీఆర్ఆర్ సివిల్ పనుల పురోగతిపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రెడ్ క్రాస్ నిధులతో చేపట్టిన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పాత క్రిటికల్ కేర్ బ్లాక్‌ను తక్షణమే నవీకరించాలని సూచించారు.రోగులకు వీలుగా తూర్పు వైపు ముం దుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు నీరు నిలవకుండా మూడు అవుట్‌లెట్ల ద్వారా తరలించి దోమల వ్యా ప్తిని అరికట్టాలని,నగర పాలక సంస్థ తరపున నాలుగు జనరల్ వేస్ట్ డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిచెన్ సదుపాయాలను అత్యంత పరిశుభ్రంగా నిర్వహించాలన్నారు.?పిహెచ్‌సీలు,అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓపి సేవలను బలపరచడం ద్వారా జిజి హెచ్ పై భారాన్ని తగ్గించ వచ్చని తెలిపారు.24ఇ7 ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ సేవలు అందుబాటులో ఉండాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి,విశ్రాంత గుండె వ్యాధుల నిపుణుల (కార్డి యాలజిస్ట్) నియమాకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రి స్థలంలో ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ గోడ నిర్మిం చాలని, పలమనాలజీ బ్లాక్ ఏర్పాటుకు స్థల సేకరణ వేగవంతం చేయాలని అధికారులనుఆదేశించారు. స్థానిక ?శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ...లి ఆసుపత్రి లో అభివృద్ధి పనుల వల్ల రోగులకు ఇబ్బంది కలగకుండా సివిల్ పనులన్నింటినీ క్రోడీకరించి ఒకేసారి నిర్వహించాలని సూచించారు. అధునాతన మెడికల్ ఎక్విప్ మెంట్‌ను దశలవారీగా సమకూరుస్తు న్నామని, త్వరలోనే పూర్తి స్థాయి క్యాన్సర్ కేర్ బ్లాక్ అందు బాటులోకి రానుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి.సత్య నారాయణ, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల వైద్యాధికారులు జిల్లా యువజన సంఘ కార్యదర్శి గేదెల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గూడాలలో ఉచిత గర్భ పశువైద్య శిబిరం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

మండలం లోని గుడాల గ్రామం లో పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత గర్భ కోసం పశు వైద్య శిబిరం డా.మేడిద నారాయణరావు గుడాల గ్రామ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించడమైనది ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వర రావు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి పాడి రైతులు ఉద్దేశించి ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని, ఎదకురాని, తిరుగుప్రోలు పశువులు,ఎదకొచ్చిన పశువులు, చూలు పరీక్షలు పశువులలో గర్భకోశ సమస్యలు రైతులు పశు వైద్యాలకు వివరించి తగు చికిత్సలు పశువులకు చేయించాలని, విబిజి రామ్ పథకంలో మండలానికి ఏడు చొప్పున మినీ గోకులంలో(పశువుల శాలలు) ప్రభుత్వ పథకం అందుబాటులో ఉన్నదని తెలిపి ఉన్నారు. డాక్టర్ విజయ రెడ్డి సహాయ సంచాలకులు రైతులు ఉద్దేశించి తమ పశువులకు సకాలంలో నత్తల నివారణ మందు తెల్ల పశువులకు లింపి వ్యాధికి నివారణటీకాలు గర్భకోస వ్యాధులకు చికిత్సలు పశువులకు ఈ క్యాంపును ఉపయోగించుకోవాలని రైతులు కోరి ఉన్నారు. పశు వైద్య శిబిరం నందు పోలిశెట్టి భాస్కర్ రావు పిఎసిఎస్ గుడాల గ్రామం చైర్మన్ మాట్లాడుతూ రూ.1020 /- 50 కేజీల పశువుల దానాను సొసైటీలో ఉన్నదని వాటిని రైతులు తమ పశువులకు పాలు దిగుబడి కి, పున ఉత్పత్తికి మేపుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో పంపి రెడ్డి కాశీ విశ్వేశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్, రైతులు, డాక్టర్ మాధురి, డాక్టర్ కావ్య, డా. శివతేజ, రోళ్ల సాయి గోపాలమిత్ర, సురేష్ గుడాల పశుసంవర్ధక సహాయకుడు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ధర్మకర్తల మండలి చైర్మన్‌కు శుభాకంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సత్యానందరావు...



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థాన ధర్మకర్తల మండలి నూతన చైర్మెన్ గా నియమితులైన విళ్ల సూర్యనారాయణ (సూరయ్య కాపు), మండలి సభ్యులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వదేశానికి విచ్చేసిన రవికుమార్ కి శుభాకాంక్షలు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

విజయవంతం గా అమెరికా పర్యటన ను పూర్తి చేసుకొని స్వదేశానికి విచ్చేసిన కె. రవికుమార్ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి నట్లు వాకపల్లి స్వామి నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు విజయవాడ శ్రీ విఘ్నేశ్వర ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాకపల్లి స్వామి నాయుడు (పెదకాపు) రవి కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## డిప్యూటీ స్పీకర్ ని కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శించుకునేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణ రాజును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాలెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘురాం కృష్ణంరాజును ఎమ్మెల్యే సాలువతో సత్కరించారు.

## అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామికి లక్ష రూపాయలు విరాళం

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

మండలం లోని అయినవిల్లి గ్రామం శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నకు రాజమండ్రి కి చెందిన మార్ని వెంకట శివ దుర్గాప్రసాద్ (శ్రీ కార్తికేయ లారీ ట్రాన్స్ పోర్ట్) వారు కుటుంబ సమేతంగా అయినవిల్లి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించి, శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల కొరకు విరాళంగా రూ.1,00,116/- లు సమర్పించినారు. అదేవిధంగా రావులపాలెం గ్రామానికి చెందిన పెంకె సుబ్రహ్మణ్యం సుప్రియ దేవి దంపతులు రూ. 10,000 స్వామివారికి విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించగా. ఆలయ కార్యనిర్వాహణాధికారి వారు శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేసారు.ధర్మకర్తల మండలి చైర్మన్ విళ్ళ సూర్యనారాయణ అభినందనలు తెలియజేశారు.



# అయినవిల్లి ఆది గణపతి క్షేత్రాన్ని ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

## – ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అయినవిల్లి, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం అయినవిల్లి గ్రామంలోని వినాయక సదన్‌లో నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారి క్షేత్రం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటని అన్నారు. స్వయంభువుగా వెలసిన ఆది గణపతిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి ఎంతో విశిష్టమైన చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. దేశం నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన విళ్ల సూర్యనారాయణ (సూరయ్య కాపు) కి, నూతన పాలకవర్గ సభ్యులందరికీ ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పాలకవర్గం సమష్టిగా పనిచేసి భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆలయ అభివృద్ధితో పాటు క్షేత్ర పవిత్రతను కాపాడాలని సూచించారు. అయినవిల్లి క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భక్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన పార్కింగ్ సమస్యను శాసనసభలో ప్రస్తావించి, దాని పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. వినాయక సదన్ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, రూ.55 లక్షలతో ఏసీ వసతి గదులు, ఉచిత వసతి హాలులో ఏసీ సౌకర్యం, రూ.56 లక్షలతో ప్రాంగణం చుట్టూ కాంక్రీట్ చప్టా, రూ.23 లక్షలతో రంగుల పనులు, రూ.28 లక్షలతో సీసీ డ్రెయిన్ విత్ కవర్ స్లాబ్ వంటి



అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. భవిష్యత్తులో భక్తుల రాకపోకలకు అనుకూలంగా బైపాస్ రోడ్డు నిర్మాణం, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న కాలువ గట్టు రహదారి అభివృద్ధి, శిథిలావస్థలో ఉన్న ఇతర ఆలయాల పునరుద్ధరణకు సుమారు రూ.1.65 కోట్లు, ఆధునిక వసతులతో నూతన అన్నప్రసాద భవనం నిర్మాణానికి సుమారు రూ.5.25 కోట్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అయినవిల్లి క్షేత్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల కొనుగోలు, అదనపు వసతి, పార్కింగ్, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను కల్పించే విధంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప



ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ సహకారం, పాలకవర్గ సమన్వయం, అధికారుల కృషితో అయినవిల్లి ఆది గణపతి క్షేత్రాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఆలయ చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, రాష్ట్ర డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు, నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు,స్వచ్ఛంద సంస్థల సహకారంతో ?

## "స్వచ్ఛమైన – పచ్చని కాకినాడ" సాధిద్దాం –కాకినాడ ఎమ్ ఎల్ ఎ కొండబాబు



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

స్థానిక కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం లో ఆల్ ఈజ్ వెల్ కు మొక్కల సంరక్షణ కోసం స్థలం కేటాయించినందుకు డా. చిట్ల కిరణ్,డా అడ్డాల సత్యనారాయణ, కిషోర్ సభ్యులచే కాకినాడ ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ.."గ్రీన్ కాకినాడ అభివృద్ధికి చేపట్టవలసిన ముఖ్యమైన చర్యలు,ప్రణాళికలు,పచ్చ దనం,పార్కుల పెంపకం నగరం పొడవునా, రోడ్డు మార్గాలకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటడం,ఉన్న పార్కులను పునరుద్ధరించడం, కొత్తగా కమ్యూనిటీ గార్డెన్లు, గ్రీన్ జోన్లను ఏర్పాటు చేయడం చేయాలని, ఇళ్ల వద్దనే తడి చెత్త,పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను తప్పనిసరి చేయడం, తడి చెత్త నుండి సేంద్రీయ ఎరువులు తయారు చేయడం, ప్లాస్టిక్ పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం, నగరం పరిధిలో ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రత్యేకమైన సైకిల్ ట్రాక్‌లు కాలినడక మార్గాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. డా అడ్డాల మాట్లాడుతూ "కాకినాడ బీచ్‌లో రేపు ఉదయం మా ఆల్ ఈజ్ వెల్ సభ్యులు మరియు జెన్ గ్రీన్ విద్యార్థులచే క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. డా.చిట్ల కిరణ్ మాట్లాడుతూ "ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యం పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలునివాస సంఘాల ద్వారా "గ్రీన్ కాకినాడ" డ్రైవ్‌లను నిర్వహిస్తామని, "స్వచ్ఛమైన కాకినాడ – పచ్చని కాకినాడ" అనే నినాదంతో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజకుమార్, టి.వి.వి.ఎస్. ఎన్ రెడ్డి, డాక్టర్ రవివర్మ ,విక్రమ్ ,రాజేంద్ర, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

## రాజీ మార్గమే రాజమార్గం అన్న జడ్జి డి. రమాకాంత్

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 29**

నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థాన ప్రాంగణాల్లో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి డి. రమాకాంత్ తెలిపారు. లోక్ అదాలత్ ఏర్పాట్లపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి డి. రమాకాంత్ హాజరయ్యారు. లోక్ అదాలత్ లో భూ తగాదా కేసులు, రాజీ చేసుకోదగిన నేరపూరిత కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు కేసులు మరియు ఇతర పెండింగ్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని, దీనికి అప్పీల్ ఉండదని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, ఇరువర్గాలు రాజీ పడటం ద్వారా మానవ సంబంధాలు బలపడతాయని అన్నారు.



సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరగకుండా సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు నసీం సుల్తానా, నిహారిక, శృతి దూత, ఎన్. శ్రీనిధి తదితరులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చారిత్రక ఘట్టానికి వేళాయె

### 31న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా 'వెలుగొండ' ప్రారంభోత్సవం!

### మార్కాపురం మార్కెట్ యార్డులో ఐదుగురు మంత్రుల ఉన్నత స్థాయి సమీక్ష

### రైతాంగం, ప్రజలు భారీగా తరలివచ్చేలా పకడ్బందీ కార్యాచరణ

### అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపు



**యర్రగొండపాలెం – సిటిజన్ టైమ్స్)ఆగష్టు 29**

ప్రాంతీయ రైతాంగ చిరకాల స్వప్నమైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ మహోత్సవ ఏర్పాట్లపై మార్కాపురం మార్కెట్ యార్డు ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ సంయుక్తంగా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేస్తున్న వేళ, ప్రారంభోత్సవ సభను ఒక పండుగలా జరపాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, తాగునీరు, భోజన వసతి, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లలో అధికారులు పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, నక్కా ఆనందబాబు, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్ లపై పటిష్టమైన భద్రత ఏర్పాట్లపై నిఘా పెంచాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

గోదాములో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లపై పటిష్టమైన భద్రత ఏర్పాట్లపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శనివారం ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీ నందు మూడవ అంతస్తులో ఉన్న ఈవీఎంలు, వివి ప్యాట్ల భద్రత ఏర్పాట్లను పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము లో ఈవీఎంలు, వీవీప్యాట్లను భద్రపరిచిన విధానం, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లను ఎన్నికల నిబంధనల మేరకు అత్యంత భద్రతతో భద్రపరచాలని, గోదాములోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని పూర్తిగా నియంత్రించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడే విధంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పోలీస్ బందోబస్తు పెంచి సీసీ కెమెరాలు నిఘా వ్యవస్థను ప్రతిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఎలక్ట్రారోరల్ అధికారులను ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు పోలీస్ వ్యవస్థ పరివేక్షణలో ఎలక్షన్ రిజిస్ట్రేషన్ బుక్ లో సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట ముమ్మిడివరం తహసిల్దార్ టి. సుభాష్, ఎలక్షన్ నిర్వహణ అధికారులు బాలాజీ బాబ్జి రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లంచావతారం...

## ఏసీబీ వలలో ర్యాలి వీఆర్వో!



**ఆత్రేయపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 29::**

భూమి మ్యుటేషన్ కోసం అందినకాడికి దండుకోవాలనుకున్న ఓ అవినీతి అధికారి ఏసీబీ వలలో అడ్డంగా బుక్కయ్యాడు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ వీఆర్వో నాగేశ్వరరావు రూ.16,500 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. గ్రామానికి చెందిన చిన్నం లక్ష్మీ ప్రసన్న తన 0.09 ఎకరాల భూమి మ్యుటేషన్ దరఖాస్తును ముందుకు పంపాలని కోరగా, వీఆర్వో డబ్బు డిమాండ్ చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులు శనివారం సాయంత్రం పక్కా వ్యూహంతో దాడి చేశారు. గ్రామ సచివాలయంలో బాధితురాలి నుంచి నగదు తీసుకుని జేబులో పెట్టుకుంటుండగా అధికారులు మెరుపుదాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్ముతో పాటు సంబంధిత దరఖాస్తు ఫైలును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ను రద్దు చేయాలి -యుటిఎఫ్






**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 29**

ఉపాధ్యాయ ఆకాంక్షలకు భిన్నంగా విద్యాశాఖ స్పెషల్ టెట్ నోటిఫికేషన్ విడుదల చేసినందుకు నిరసనగా యు.టి.ఎఫ్ కందుకూరు డివిజన్ ఆధ్వర్యంలో పామూరు రోడ్డు కూడలి నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యు.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాశాఖ నిర్వహించబోయే స్పెషల్ టెట్లో కమ్యూనిటీ వారీగా కాకుండా అందరికీ 40 శాతం పాస్ మార్కులుగా ఉండాలని , తను బోధిస్తున్న సబ్జెక్టుకు పరిమితమై ప్రశ్నలు ఉండాలని, మాన్యువల్ గా పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేయగా అవేవీ పట్టించుకోకుండా సాధారణ టెట్ లాగానే నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తుందని, ఒకవైపు పాఠశాలలో అనేక బోధనేతర పనులతో సతమతమవుతుంటే 2010కి ముందు నియామకమైన టీచర్లు అందరూ టెట్ పాస్ కావాలని నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వమే ఉపాధ్యాయులను ప్రత్యక్ష ఆందోళనకు పూనుకునేలా చేసిందని రాయితీలు లేకుండా విడుదల చేసిన స్పెషల్ టెట్ నోటిఫికేషన్ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని, 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు జరుగుతాయని, సెప్టెంబర్ మూడవ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే నాలుగవ తేదీ నుండి ఆమరణ దీక్షలకు పూనుకుంటామని తెలియజేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జి. మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శి పి .వెంకటేశ్వర్లు మండల అధ్యక్ష కార్యదర్శులు చిత్తార వెంకటేశ్వర్లు, మక్కిన రమేష్ బాబు,సూర్య నారాయణ , కె.వెంకటరావు, ఎం.హనుమంతరావు,మహిళా కార్యకర్తలు ఎం.లెనీనా, యు.జ్యోతి కుమారి సీనియర్ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాహితీవేత్త గొట్టిముక్కుల నాసరయ్యకు ప్రతిష్ఠాత్మక 'గిడుగు' జాతీయ పురస్కారం!

**విజయవాడలో వైభవంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు**

**గిడుగు వంశీయుల చేతుల మీదుగా ఘనంగా సత్కారం**



**త్రిపురాంతకం, ఆగష్టు 29, సిటిజన్ టైమ్స్**

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గొట్టిముక్కుల నాసరయ్య ప్రతిష్ఠాత్మక గిడుగు వేంకట రామమూర్తి పంతులు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల, సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాసరయ్య తొలుత వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో పాల్గొని ఆయన వినిపించిన మాతృభాషా వైభవ కవితాగానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఆయన కనబరుస్తున్న అంకితభావం, సృజనాత్మక ప్రతిభను గుర్తించి నిర్వాహకులు ఆయనకు 'గిడుగు వేంకట రామమూర్తి పంతులు జాతీయ పురస్కారం' ప్రదానం చేశారు. గిడుగు రామ్మూర్తి మునిమనవడు గిడుగు వేంకట నాగేశ్వరరావు, మునిమనవరాలు గిడుగు సరస్వతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ, సభాధ్యక్షులు ఎస్. రవికుమార్, 'మల్లెతీగ' సంపాదకులు కలిమిశ్రీ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి నాసరయ్యను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నేడు విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం

**జిల్లా కన్వీనర్ చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం.**



**కంభం సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

విశ్వబ్రాహ్మణుల ప్రముఖుల ఆత్మీయ సత్కార సభ నిర్వహించడం జరుగుతుందని మార్కాపురం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. కంభం పట్టణంలోని అప్సర ఏసీ కళ్యాణమండపం నందు ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రముఖులు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ హైదరాబాద్ వారు కమ్మరపల్లి మల్లికార్జున కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా రానున్నారని ఆయన తెలిపారు. సమాజ సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టడమే కాక అలాగే విశ్వబ్రాహ్మణుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం తోపాటు అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సమాజానికి చెందిన పలువురు ప్రముఖులు అనేక రంగాల్లో విశేష సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అలాగే సమాజంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సంక్షేమం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి జిల్లాలోని విశ్వబ్రాహ్మణులు హాజరై తమ సమస్యలు సూచనలు తెలియజేసి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పూజల పేరుతో 50 లక్షలు వసూలు

*తిరిగి ఇవ్వమని కోరడంతో మహిళ హత్య*

*సంచలనం సృష్టిస్తున్న వీరభద్రపురం హత్య*









**అర్ధవీడు, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

పూజల పేరుతో రూ 50 లక్షలు వసూలు చేసి తిరిగి ఇవ్వమని కోరడంతో మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం వీరభద్రపురం గ్రామంలో జరిగింది. వివరాల మేరకు పెద్దారవీడు మండలం ప్రగల్లపాడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ జూలై 21వ తేదీ నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పెద్దారవీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన ఆదిలక్ష్మి కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె మొబైల్ ఫోన్ చివరి సిగ్నల్ ఆధారంగా విచారణ కొనసాగించగా, ఆమె హత్యకు గురై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. పెద్దారవీడు మండలం ప్రగల్లపాడు నుండి వలస వచ్చి వీరభద్రపురం గ్రామంలో నివాసం ఉంటున్న రాజమ్మ అనే మహిళ పూజల ద్వారా నగదు వృద్ధి చేస్తానని నమ్మించి ఆదిలక్ష్మి నుంచి సుమారు రూ.50 లక్షల వరకు నగదు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే నగదు పెరగకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆదిలక్ష్మి రాజమ్మపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఆదిలక్ష్మిని తన గ్రామానికి పిలిపించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తుంది. అలాగే ఆదిలక్ష్మి మొబైల్ ఫోన్ సమీపంలోని చెక్ డ్యామ్ నీటి కుంటలో పడేసినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం ఏమీ తెలియనట్లుగా కుటుంబ సభ్యులతో కలిసి కాశీకి వెళ్లి వచ్చినట్లు సమాచారం. మరికొందరి నుంచి నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజమ్మ, ఆదిలక్ష్మి నుంచే కాకుండా మరో పది మందికి పైగా వ్యక్తుల నుంచి కూడా పూజల పేరుతో నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఆరోపణలపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆదిలక్ష్మి మృతదేహాన్ని శనివారం వెలికితీశారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల ఆకస్మిక తనిఖీ...

**గోడి గురుకుల పాఠశాలలో**

**భోజన సదుపాయాలపై తీవ్ర ఆగ్రహం**



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

బాలుర గోడి గురుకుల పాఠశాలలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, సంపూర్ణ భోజనం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగినట్లు గుర్తించారు. విద్యార్థులతో మాట్లాడగా, మెనూ ప్రకారం భోజనం అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీలో ప్రధాన లోపాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. స్టాక్ రిజిస్టర్లో ఎక్కడా సరైన వివరాలు నమోదు చేయకపోవడశీ, మెనూ ప్రకారం పెట్టాల్సిన కూరలు వండకపోవడం,విద్యార్థులకు అందించాల్సిన పాలు, పెరుగు ఇవ్వకపోవడం,పప్పు, పాలకూర ఉండాల్సిన రోజు కేవలం సాంబార్ మాత్రమే అందించడం, క్యాబేజీ కర్రీ వండాల్సిన చోట దొండకాయ కర్రీ వండడశీ, మెనూ అమలులో నిర్లక్ష్యం, భోజన నిర్వహణలో అస్తవ్యస్త పరిస్థితులు ఈ పరిస్థితులపై రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లా అధికారి డీసీ కి ఫోన్ చేసి, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాల ప్రిన్సిపాల్తో పాటు సంబంధిత అధికారులకు మెమో జారీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. విద్యార్థుల ఆహారంతో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు. మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం ప్రతి విద్యార్థికి అందే వరకు రాష్ట్ర ఆహార కమిషన్ పర్యవేక్షణ కొనసాగుతుంది.

# కేజీబీవీ లో ఘనంగా తెలుగు భాష జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**సి.ఎస్.పురం, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం కేజీబీవీ బాలికల విద్యాలయంలో శనివారం ప్రిన్సిపాల్ షేక్ రేష్మ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాషా జాతీయ దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్యమానికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షేక్ రేష్మ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ దేశానికి క్రీడా రంగంలో అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన క్రీడా ప్రస్థానం, హాకీపై ఉన్న అభిమానం, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని విద్యార్థినులకు వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకుని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్యమానికి విశేష కృషి చేసిన



గిడుగు వెంకట రామమూర్తి పంతులు చతెలుగు భాష గొప్పతనాన్ని మాతృభాషను ప్రేమించడం, గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలుగు భాషను భావితరాలకు అందించేందుకు విద్యార్థినీలు తమ వంతు కృషి చేయాలని, తెలుగు భాషను నిత్య జీవితంలో విరివిగా ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# అల్లినగరం హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహణ



**కొమరోలు, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

కొమరోలు మండలం అల్లినగరంలో గల మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం తెలుగు భాషా దినోత్సవం,క్రీడా దినోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ అధ్యక్షత వహించి తెలుగు భాష కోవిదుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి, జాతీయ క్రీడాకారుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆమె విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యత, తెలుగు సాహిత్యాన్ని, మన సంస్కృతి, మాతృభాష పరిరక్షణ తదితర అంశాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి, అభిమానం పెంపొందించుకోవాలని, కృషి పట్టుదల క్రమశిక్షణతో గొప్ప క్రీడాకారులుగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం తో పాటు క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు జట్టు స్ఫూర్తి తదితర అంశాలను క్రీడలు పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకొని ఆ పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల పోటీలలో విజేతలు గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్ రాజు, చంద్రమోహన్,శివరాం,హరి కుమార చౌదరి,ఆదిలక్ష్మి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, బోధ నేతర సిబ్బంది పకీరయ్య,అశ్వినీ దేవి తదితర ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## -డీలర్ డి. నరేష్




**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

పర్యావరణాన్ని పరిరక్షించుటకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీలర్ డి నరేష్ అన్నారు మండలంలోని పెద్ద రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం గ్రామ డీలర్ డి. నరేష్ ఆర్థిక సహకారంతో పాఠశాలకు మరియు గ్రామంలో సుమారు 500 మొక్కల పంపిణీ చేశారు ఈ సందర్భంగా డీలర్ నరేష్ ను పాఠశాల సిబ్బంది గ్రామస్తులు అభినందించారు ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి పలువురు వివరించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పర్యావరణం కాపాడడం మనందరి బాధ్యత అని అందులో భాగంగా డీలర్ నరేష్ సహకారంతో మొక్కల పంపిణీ జరిగిందని తెలిపారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో బహుమతులు పొందిన విద్యార్థిని విద్యార్థులకు డి. సుమన్ తన సొంత నిధులతో బహుమతుల ప్రధానం చేశారు మండల టిడిపి నాయకుడు అట్లూరి రామకృష్ణ రాజు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పర్యావరణ సమతుల్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కే ఓబయ్య, మండల టిడిపి నాయకులు ఆదినారాయణ, మాజీ సర్పంచ్ మాలకొండయ్య , డి సుమన్, నాగ సుభాష్, నాగ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నోటరీగా మోడీ పిచయ్య

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 29**

గిద్దలూరు,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో న్యాయవాదిగా పనిచేస్తున్న మోడీ. పిచ్చయ్యను ప్రభుత్వ నోటరిగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు మోడీ. పిచ్చయ్య నోటరీగా నియమితులు కావడంతో పలువురు న్యాయవాదులు, మిత్రులు , ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మోడీ. పిచ్చయ్య మాట్లాడుతూ రైతులకు విద్యార్థులకు సంబందించిన అఫిడవిట్ల కు నోటరీ లు ఉచితముగ చేయగలనని, ప్రజలకు ఏదైనా న్యాయ సలహాలు,సూచనలు ఉచితంగ చేయగలనన్నారు. సంప్రదించవలసిన వారు, గిద్దలూరు పట్టణం లోని కుమ్మరాము కట్ట సెంటర్ నందు వారి ఆఫీస్ లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉండగలరని తెలిపారు.

# రోగనిరోధక శక్తిని పెంచే అంజీర్





చలికాలంలో అంజీర్ పండ్లు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండూ గుర్తించిన ఈ సూపర్ ఫుడ్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఎముకల బలం, మలబద్ధక నివారణ, గుండె ఆరోగ్యం, మధుమేహ నియంత్రణ, రక్తహీనత దూరం, బరువు తగ్గడానికి తోడ్పడుతుంది. చలికాలం వచ్చిందంటే చాలు.. బాడీలో ఇమ్యూనిటీ తగ్గి రకరకాల ఇన్ఫెక్షన్లు చుట్టుముడుతుంటాయి. ఈ సమయంలో ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన వరం అంజీర్. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండూ సూపర్‌ఫుడ్‌గా గుర్తించిన అంజీర్ పండ్లు.. చలికాలంలో ఔషధంగా పనిచేస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. అంజీర్ పండ్లు కాల్షియానికి కేరాఫ్ అడ్రస్. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల వ్యాధుల నుండి ఇది రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా చలికాలంలో వేధించే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందాలంటే అంజీర్ తప్పనిసరి. చలికాలంలో నీరు తక్కువగా తాగడం వల్ల చాలామంది మలబద్ధకంతో బాధపడుతుంటారు. అంజీర్‌లో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ సహజ విరేచనకారిలా పనిచేసి, పేగులను శుభ్రపరుస్తుంది. రక్తంలోని చెడు కొవ్వు (ట్రైగ్లిజరైడ్స్) స్థాయిలను తగ్గించడంలో అంజీర్ కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తూ, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంజీర్ తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో ఉండే క్లోరోజెనిక్ ఆమ్లం శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను మెరుగుపరుస్తుంది. ఇది టైప్-2 డయాబెటిస్ బాధితులకు మేలు చేస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండి, త్వరగా అలసిపోయేవారికి అంజీర్ ఒక వరం. దీనిలోని ఐరన్ కంటెంట్ రక్తాన్ని వృద్ధి చేసి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. విటమిన్ సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే అంజీర్ పండ్లు.. జలుబు, దగ్గు వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి. చర్మం పొడిబారకుండా కాంతివంతంగా ఉండేలా చేస్తాయి. శీతాకాలంలో బరువు పెరగకుండా ఉండాలంటే అంజీర్‌ను స్నాక్‌గా తీసుకోవచ్చు. ఇది తిన్న తర్వాత ఆకలి త్వరగా వేయదు, దీనివల్ల జీవక్రియ వేగవంతమవుతుంది. నిపుణుల సూచన ప్రకారం.. రెండు అంజీర్ పండ్లను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ పండ్లను తిని, ఆ నీటిని కూడా తాగాలి. ఇలా చేయడం వల్ల పోషకాలు శరీరానికి పూర్తిస్థాయిలో అందుతాయి.

# ఖాళీ కడుపుతో వెల్లుల్లి తింటే.. ఇన్ని ప్రయోజనాలా!

వెల్లుల్లి ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుందని చాలా మందికి తెలుసు కానీ.. ఇక్కడ అందరికీ ఉన్న డౌట్ ఏమిటంటే.. వెల్లుల్లిని ఏ సమయంలో తినాలి.. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం సరైనదేనా అని?.. కాబట్టి ఇప్పుడు మనం వెల్లుల్లి ఖాళీ కడుపుతో తినడం సరైదేనా? వెల్లుల్లి ఇది లేకుంటే వంటకాలకు టేస్ట్ ఉండదు. ఇది కేవలం రుచికి మాత్రమే కాదు.. మన శరీరానికి ఔషదంగా కూడా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలు మనను అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. దీని ప్రధాన ప్రయోజనం అల్లిసిన్ అనే సమ్మేళనం వల్ల వస్తుంది. వెల్లుల్లిలో భాస్వరం, జింక్, పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె , ఫోలేట్ , నియాసిన్, థియామిన్ కూడా ఉన్నాయి. అయితే దీన్ని ఖాళీ కడుపుతో తినడం సరైనదా.. కాదా అని చాలా మందికి సందేహాలు ఉన్నాయి. అయితే దీన్ని ఖాళీ కడపుతో తినొచ్చని నిపుణులు అంటున్నారు. రోగనిరోధక శక్తి: వెల్లుల్లి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. అలాగే, ఇది జలుబు, ఫ్లూ వంటి సమస్యలను దూరం చేస్తుంది.గుండె ఆరోగ్యం: ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు సమతుల్యం అవుతాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహించేందుకు సహాయపడుతుంది. ఇది రక్తపోటును సైతం నియంత్రించి గుండె ఆరోగ్యానికి మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి వెల్లుల్లి ఒక మంచి ఎంపిక.. ఇది జీవక్రియను సక్రియం చేస్తుంది, ఇది మన శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించడానికి సహాయపడుతుంది. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్లా త్వరగా బరువు తగ్గవచ్చు. జీర్ణక్రియ: ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అలాగే గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. దీన్ని తినడం వల్ల కడుపు తేలికగా అనిపిస్తుంది. చర్మం,జుట్టుకు ప్రయోజనాలు: వెల్లుల్లి చర్మంతో పాటు జుట్టుకు కూడా ప్రయోజకరంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని స్పష్టంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. అదే సమయంలో, ఇది జుట్టును బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. ఉదయం పళ్ళు తోముకున్న తర్వాత వెల్లుల్లి రెబ్బ తొక్క తీసి తేలికగా నమలవచ్చు. లేకపోతే, నీటిలో నానబెట్టుకొని కూడా తినవచ్చు. ఒక వేళ పచ్చి వెల్లుల్లి తినడం మీకు కష్టంగా అనిపిస్తే, దాని మెత్తగా దంచి గోరువెచ్చని నీటిలో వేసుకొని తాగవచ్చు. అయితే ఇక్కడ మీరు గుర్తుంచుకోవలసి విషయం ఏమిటంటే మీకు ఏవైనా అలెర్జీ సమస్యలు ఉంటే, మీరు దానిని తినకుండా జాగ్రత్త వహించాలి. అలాగే, దీనిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం చాలా ముఖ్యం.



# మునగ వీరికి విషంతో సమానమే!

మునగ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు,యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వివిధ ప్రయోజనాలను పొందవచ్చు. మునగ సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభిస్తుంది. మునగ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే విటమిన్లు, ఖనిజాలు,యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వివిధ ప్రయోజనాలను పొందవచ్చు. మునగ సాధారణంగా దాదాపు అన్ని సీజన్లలో లభిస్తుంది. దీని రుచి, ఆరోగ్య ప్రయోజనాల కారణంగా వివిధ కూరలు, సూప్‌లు, సాంప్రదాయ వంటకాలలో ఉపయోగిస్తుంటారు. మునగ కాయలేకాదు దీని ఆకుల్లో కూడ సహజంగా లభించే ప్రోటీన్ పుష్కలంగా ఉంటాయి. మునగ కాయ జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి, వాపుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. దీని ఔషధ గుణాల కారణంగా వంటల్లో విస్తృతంగా వినియోగిస్తుంటారు. కానీ మునగతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొంతమంది ఆరోగ్యానికి ఇది అస్సలు మంచిది కాదు. ఇలాంటి వారు మునగ వంటకాలు తినడం కోరి సమస్యలను కొని తెచ్చుకోవడమే. మునగ వంటకాలు తినాలా? వద్దా? అనేది ఆయా వ్యక్తుల ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. గర్భిణీలు మునగ తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఇది శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తుంది. ఇది గర్భధారణ సమయంలో అసౌకర్యం, సమస్యలకు దారితీస్తుంది. అలాగే పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావంతో ఇబ్బంది పడే స్త్రీలు కూడా మునగ తినకుండా ఉండాలి. దీనిలోని వేడి లక్షణాలు రక్తస్రావాన్ని మరింత పెంచుతాయి. అంతేకాకుండా శరీరంలో బలహీనత, అసౌకర్యాన్ని కూడా కలిగిస్తాయి.మునగ సహజంగానే రక్తపోటును తగ్గిస్తుంది. అయితే ఇప్పటికే తక్కువ రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు ఈ కూరగాయను తినకూడదు. ఎందుకంటే ఇది పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు.తలతిరగడం, అలసట వంటి లక్షణాలతో బాధపడే వారు కూడా మునగ కాయల వినియోగాన్ని పరిమితం చేయాలి. దీర్ఘకాలిక జీర్ణ సమస్యలతో బాధపడేవారు మునగ ఎక్కువగా తినకూడదు. వీటిని పరిమితంగా తీసుకోవాలి లేదంటే పూర్తిగా మానేయాలి. ఎందుకంటే ఇందులో ఫైబర్, శక్తి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది కొంతమందిలో ఉబ్బరం, ఆమ్లత్వం, కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కాబట్టి మునగ తినేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండటం మంచిది.

# రాత్రి భోజనంలో తప్పులు ఈ వ్యాధులకు కారణం




బ్రేక్ ఫాస్ట్ ఎంత ముఖ్యమో, రాత్రి తినే ఆహారం కూడా అంతే ముఖ్యం. మీ డిన్నర్ లో 3 తప్పులు చేస్తే, తప్పకుండా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెజర్, గుండె జబ్బులు తప్పకుండా వస్తాయని డైటీషియన్ రిచా హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట ఆలస్యంగా తినడంలో చేసే తప్పులు: కొన్ని అధ్యయనాలు 90% ఆహారం రాత్రిపూట తింటాయని చెబుతున్నాయి. మనం రోజంతా బిజీగా ఉండటం వల్ల, రాత్రిపూట ప్రశాంతంగా తినవచ్చు. మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాలు, బిర్యానీ వంటి ఆహారాలు, చపాతీ వంటి ఆహారాలు, కారంగా ఉండే ఆహారాలు ఎక్కువగా తీసుకుంటారు. తదుపరి తప్పు ఏమిటంటే రాత్రి భోజనం చాలా ఆలస్యంగా తినడం. మూడవ తప్పు ఏమిటంటే, రాత్రి భోజనం చేసిన తర్వాత సెల్ ఫోన్‌లో కొంత సమయం గడిపి నేరుగా పడుకోవడం. ఇది చాలా చాలా తప్పు విషయం. రాత్రి భోజనం చేయడానికి, నిద్రించడానికి మధ్య కనీసం మూడు గంటల గ్యాప్ ఉండాలి. ఈ తప్పులన్నీ చేయడం వల్ల తలెత్తే సమస్యలు మీపైకి వస్తాయని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెడు కొలెస్ట్రాల్ పెరిగే సమస్య: రాత్రిపూట బిర్యానీ తినే అలవాటు ఇప్పుడు చాలా పెరుగుతోంది. దీనితో పాటు, వారు కబాబ్స్ మరియు చికెన్ 65 వంటి వేయించిన, డీప్-ఫ్రై చేసిన ఆహారాలను కూడా తింటారు.అధిక కొవ్వు, ముఖ్యంగా సంతృప్త కొవ్వు, చెడు కొలెస్ట్రాల్ అని పిలువబడే ట్రాన్స్ ఫ్యాట్, %ాణు% కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతాయి. ప్రేగు కదలిక సమస్యలు: సిర్కాడియన్ రిథమ్ ప్రకారం, సూర్యాస్తమయం తర్వాత శరీర అవయవాలు విశ్రాంతి తీసుకోవడం ప్రారంభిస్తాయి. ఆ సమయంలో, రాత్రి భోజనం ఆలస్యంగా లేదా కఠినమైన ఆహారం రూపంలో తిన్నప్పుడు, అది రాత్రంతా జీర్ణం కాకుండా కడుపులోనే ఉంటుంది. జీర్ణవ్యవస్థ మరుసటి రోజు ఉదయం మళ్ళీ పనిచేయడం ప్రారంభిస్తుంది. రాత్రి భోజనం జీర్ణం కావడానికి ముందు, మనం అల్పాహారం తినడం ప్రారంభిస్తాము. మనం స్నాక్స్, తదుపరి భోజనం తిన్నప్పుడు, అవి జీర్ణం కావు. అపానవాయువు, ఉబ్బరం, గుండెల్లో మంటకు కారణమవుతాయి మరియు ఇది దీర్ఘకాలిక స్థితిలో కొనసాగితే, పెద్దప్రేగు క్యాన్సర్ వస్తుంది. మధుమేహం వచ్చే ప్రమాదం: మధుమేహం రావడానికి అతి ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటి పేలవమైన ఆహారపు అలవాట్లు. ప్రజలు రోజంతా నియంత్రణలో ఉండవచ్చు కానీ రాత్రి సమయంలో నియంత్రణ కోల్పోతారు.లేదా, దోస, చపాతీ వంటి కార్బోహైడ్రేట్ ఆహారాలు రాత్రిపూట తినడం, ఆలస్యంగా తినడం, అధిక గ్లైసెమిక్ సూచిక ఉన్న ఆహారాలు తీసుకోవడం ద్వారా, శరీరంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి రాత్రంతా ఎక్కువగా ఉంటుంది. ఇది ఉదయం రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరగడానికి దారితీస్తుంది. రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదాలు: రాత్రి ఆలస్యంగా తినడం, చాలా ఆలస్యంగా నిద్రపోవడం వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ పెరుగుతుంది. ఒత్తిడి పెరిగినప్పుడు, రక్తపోటు పెరుగుతుంది. ఇది రాత్రిపూట గుండెకు మంచిది కాదు. రాత్రిపూట రక్తపోటులో హెచ్చుతగ్గులు గుండెపోటు వంటి సమస్యలకు దారితీయవచ్చు. ఊబకాయం సంబంధిత సమస్యలు: మీరు రాత్రిపూట బిర్యానీ, స్పైసీ ఫుడ్స్ మరియు కార్బోహైడ్రేట్లు కలిగిన అధిక కేలరీల ఆహారాలు తిన్నప్పుడు, మీ కేలరీలు సహజంగా పెరుగుతాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. మీరు ఇలా చేస్తూనే ఉంటే, ఆలస్యంగా నిద్రపోతే, రాత్రిపూట ఆకలిగా ఉండి జంక్ ఫుడ్ తింటే, మీరు అత్యంత తీవ్రమైన ఊబకాయం సమస్యతో బాధపడతారు.

# ఈ తప్పులతో జ్ఞాపకశక్తి గల్లంతే..



మన మెదడు అత్యంత కీలకమైన అవయవం. తెలియకుండానే మనం చేసే కొన్ని అలవాట్లు దాని పనితీరును దెబ్బతీస్తాయి. నిద్రలేమి, అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్, డిజిటల్ వ్యసనం జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను తగ్గిస్తాయి. మన శరీరంలో అత్యంత కీలకమైన, సున్నితమైన అవయవం మెదడు. ఇది మనం నిద్రపోతున్నప్పుడు కూడా విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. అయితే మనకు తెలియకుండానే మనం చేసే కొన్ని చిన్న చిన్న తప్పులు మెదడు పనితీరును దెబ్బతీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలకు కారణమయ్యే ఆ 5 ప్రమాదకరమైన అలవాట్లు ఏమిటో ఇప్పుడు చూద్దాం.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది నిద్రను త్యాగం చేస్తున్నారు. కానీ నిద్ర లేకపోవడం వల్ల మెదడు కణాలకు తీరని నష్టం జరుగుతుంది. మనం నిద్రపోతున్నప్పుడు మెదడు రోజంతా సేకరించిన సమాచారాన్ని భద్రపరుస్తుంది. వ్యర్థాలను శుభ్రం చేస్తుంది. నిద్ర తగ్గితే మెదడు మొద్దుబారిపోయి అల్జీమర్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. చిన్నపాటి ఒత్తిడి పనులను త్వరగా పూర్తి చేయడానికి సహాయపడవచ్చు.. కానీ నిరంతర ఒత్తిడి మెదడుకు విషం లాంటిది. ఒత్తిడి పెరిగినప్పుడు శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది మెదడులో జ్ఞాపకశక్తికి కేంద్రమైన హిప్పోకాంపస్ అనే భాగాన్ని దెబ్బతీస్తుంది. దీనివల్ల విషయాలను త్వరగా మర్చిపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో తడబడటం వంటివి జరుగుతాయి. వ్యాయామం కేవలం కండరాల కోసమే కాదు మెదడు చురుగ్గా ఉండటానికి కూడా అవసరం. మనం వ్యాయామం చేసినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ పెరిగి, తగినంత ఆక్సిజన్ అందుతుంది. ఇది కొత్త మెదడు కణాలు పుట్టడానికి సహాయపడుతుంది. రోజంతా ఒకే చోట కూర్చుని ఉండటం వల్ల మెదడు పనితీరు నెమ్మదిస్తుంది. జంక్ ఫుడ్ -అధిక చక్కెరమనం తినే ఆహారం మెదడు ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక చక్కెర ఉన్న స్వీట్లు, సోడాలు మెదడులో వాపును కలిగిస్తాయి. ఇవి మెదడులోని న్యూరాన్ల మధ్య సమాచార మార్పిడిని అడ్డుకుంటాయి. తెలివితేటలు పెరగాలంటే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉండే వాల్‌నట్స్, చేపలు, ఆకుకూరలు తీసుకోవడం ఉత్తమం. గంటల తరబడి స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియాలో గడపడం వల్ల మెదడుపై తీవ్రమైన భారం పడుతుంది. ముఖ్యంగా రాత్రివేళ మొబైల్ నుంచి వచ్చే నీలి కాంతి మెదడును నిద్రపోనివ్వదు. ఇది ఏకాగ్రతను దెబ్బతీయడమే కాకుండా, మెదడును ఎప్పుడూ అలసిపోయినట్లు చేస్తుంది. మెదడు ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. సరైన నిద్ర, పౌష్టికాహారం, ఒత్తిడి లేని జీవనం అలవాటు చేసుకుంటే వృద్ధాప్యంలో కూడా మీ మెదడు 20 ఏళ్ల యువకుడిలా చురుగ్గా పనిచేస్తుంది.

# 'టాక్సిక్' ఎలా ఉంది? యశ్ సినిమాకు పబ్లిక్ టాక్ పాజిటివా.. నెగిటివా?



యష్ నటించిన భారీ అంచనాల చిత్రం 'టాక్సిక్' ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. KGF 2 తర్వాత దాదాపు నాలుగేళ్లకు యశ్ సినిమా రావడంతో అభిమానుల్లో భారీ హైప్ నెలకొంది. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వస్తున్న తొలి స్పందనలు మాత్రం మిక్స్‌డ్‌గా ఉన్నాయి.

సినిమాకు ప్లస్ పాయింట్స్

యశ్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు మంచి రెస్పాన్స్

యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి

రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలిచిందనే టాక్

భారీగా తెరకెక్కించిన విజువల్స్, మేకింగ్‌కు ప్రశంసలు

యశ్ పెర్ఫార్మెన్స్ కెరీర్‌లో బెస్ట్ అని కొందరి అభిప్రాయం

క్లైమాక్స్‌కు మంచి స్పందన వస్తున్నట్లు ప్రేక్షకుల కామెంట్లు

**మైనస్ పాయింట్స్ ఇవే..**

3 గంటల 12 నిమిషాల రన్‌టైమ్ కొంత ఇబ్బందిగా అనిపించిందనే టాక్కథనం నెమ్మదిగా సాగుతుందని కొందరు అంటున్నారు

క్లిష్టమైన నేరేషన్‌తో కథ అర్థం చేసుకోవడం కష్టంగా ఉందనే అభిప్రాయాలుపాత్రల పరిచయం, డైలాగ్స్‌పై విమర్శలు

ఎడిటింగ్, స్క్రీన్‌ప్లేపై కొంతమంది ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుఅధిక హింస కారణంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చకపోవచ్చనే టాక్

?? **కథేంటి?**

1950ల నాటి గోవా నేపథ్యంలో కథ సాగుతుంది. పోర్చుగీస్ పాలన సమయంలో సముద్ర మార్గంలో జరిగే స్మగ్లింగ్, గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్య పోరు, నేర సామ్రాజ్యాల చుట్టూ కథ తిరుగుతుంది.

ఈ నేర ప్రపంచంలోకి అడుగుపెట్టిన రాయా తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాడు. అయితే కుటుంబ బంధాలు, ప్రేమ,



నమ్మకద్రోహం, ప్రతీకారం అతడి జీవితంలోకి రావడంతో కథ కీలక మలుపులు తిరుగుతుంది.

యశ్ ఈ సినిమాలో డ్యూయల్ రోల్‌లో కనిపించడం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

**యశ్ పెర్ఫార్మెన్స్ ఎలా ఉంది?**

'ఖ+ఖీ'లో రాఖీ భాయ్‌గా మాస్ ఇమేజ్ సొంతం చేసుకున్న యశ్.. 'టాక్సిక్'లో మరింత డార్క్ షేడ్స్ ఉన్న గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించాడు. అతడి బాడీ లాంగ్వేజ్, యాటిట్యూడ్, యాక్షన్ సీన్స్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది.

**మరి పబ్లిక్ టాక్ పాజిటివా.. నెగిటివా?**

ప్రస్తుతం వస్తున్న స్పందనలను బట్టి 'టాక్సిక్'కు మిక్స్‌డ్ టాక్ వినిపిస్తోంది యశ్ అభిమానులకు మాత్రం సినిమ బాగా నచ్చుతున్నట్లు తెలుస్తోంది. అయి సాధారణ ప్రేక్షకుల్లో కొంతమంది స్లో నే ఎక్కువ రన్‌టైమ్, కాంప్లెక్స్ స్క్రీన్‌ప్లేపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మొత్తంగా:** యశ్ స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్, BGM, భారీ మేకింగ్ సినిమాకు బలంగా నిలవగా.. కథనం, రన్‌టైమ్, స్క్రీన్‌ప్లే కొన్ని వర్గాల ప్రేక్షకులకు మైనస్‌గా మారినట్లు తొ టాక్ సూచిస్తోంది.



## ఇతరులతో పోల్చుకోవద్దు.. సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు: సూర్యకుమార్ యాదవ్

- యువ క్రికెటర్లు ఇతరులతో పోల్చుకోవద్దన్న సూర్యకుమార్
- వయసుతో పనిలేదు, సన్నద్ధతే ప్రధానమని స్పష్టీకరణ
- పరుగులు చేస్తూ ఉంటే సెలక్టర్లే వెతుక్కుంటూ వస్తారని భరోసా
- దేశవాళీ క్రికెట్‌లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకున్న స్టార్ బ్యాటర్
- ఎవరూ చూడనప్పుడు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచన



జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు.

ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు.

భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ,

నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనించనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచించాడు.

సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం

చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు" అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

## గ్రౌండ్‌లోనే కాదు.. బ్రాండ్ మార్కెట్‌లోనూ మన స్టార్లదే హవా: ఫోర్బ్స్ ఇండియా 2026 రిపోర్ట్!






: భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్ల మంది ఆరాధించే ఒక అతిపెద్ద పండుగ.. టీమిండియా స్టార్ ప్లేయర్లు మైదానంలోకి దిగితే రికార్డులు బ్రేక్ అవుతాయి, అదే వాణిజ్య ప్రపంచంలోకి అడుగుపెడితే బిజినెస్ డీల్స్ దుమ్మురేపుతాయి. ప్రపంచంలోనే ఏ క్రీడాకారులకూ లేనంతటి ఫ్యాన్ బేస్, మార్కెట్ పొటెన్షియల్ భారత క్రికెటర్ల సొంతం. తమ ఆటతీరుతో పాటు మైండ్ బ్లాకింగ్ పర్సనాలిటీ, సోషల్ మీడియా ఇంపాక్ట్‌తో స్టేడియం సరిహద్దులు దాటి కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికినా సరే, వీరి బ్రాండ్ వ్యాల్యూ కొద్దిగా కూడా తగ్గకపోవడం వీరికున్న భారీ క్రేజ్‌కు అద్దం పడుతోంది. తాజాగా ప్రముఖ వ్యాపార పత్రిక వెల్లడించిన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 (ఖీశీతీఎవం ×అఎఖు ూష్ట్రశీషశీజూజూవతీం 2026) అత్యంత విలువైన సెలబ్రిటీల జాబితాలో ఇండియన్ క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. సినిమా, సంగీతం, క్రీడలు.. ఇలా దేశంలోని అన్ని రంగాల బిగ్ సెలబ్రిటీలను దాటుకుని కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ (రూ.3,017 కోట్లు), గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా (రూ.2,507 కోట్లు)లను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. టీ20, టెస్టుల నుంచి తప్పుకున్నా కోహ్లీకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. బ్రాండ్ విలువ: ఏకంగా రూ.3,542 కోట్లు

**రెండో స్థానంలో కెప్టెన్ కూల్ ధోనీ:**

భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ జాబితాలో రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ సుమారు రూ.2,141 కోట్లు. మహీ భాయ్ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ధోనీకి ఉన్న అభిమానగణం, వ్యాపార కార్యకలాపాలు, ప్రకటనల ఒప్పందాలు అతడి బ్రాండ్ విలువను భారీగా నిలబెట్టాయి. మొత్తం భారత సెలబ్రిటీల జాబితాలో ధోనీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**దక్షిణాసియాసంస్కృతి తెలుసుకోవడం**

**మూడో స్థానంలో మాస్టర్ సచిన్:**

క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఫోర్బ్స్ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సచిన్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతుంది. మొత్తం సెలబ్రిటీల లిస్టులో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.

**నాలుగో స్థానంలో బుమ్రా:**


ఇక భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత బ్యాండ్ వ్యాల్యూ కలిగిన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లుగా నమోదు అయింది. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో నిలిచాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

**ఐదో స్థానంలో రోహిత్ శర్మ:**

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెటర్ల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,055 కోట్లు అని చెప్పాలి.. మొత్తం సెలబ్రిటీల జాబితాలో రోహిత్ 18వ స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి విజయాలు, అభిమానుల్లో ఉన్న ఆదరణ, వాణిజ్య ఒప్పందాలు బ్రాండ్ విలువను పెంచడంలో కీలకంగా మారాయి.

ఫోర్బ్స్ ఇండియా 2026 టాప్--5 జాబితాలో చోటు దక్కించుకున్న ఈ ఐదుగురు భారత క్రికెటర్ల మొత్తం బ్రాండ్ విలువ కలిపితే ఏకంగా రూ.9,556 కోట్లు కావడం విశేషం. గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలతో పాటు మైదానం బయట వారికున్న లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ ఇమేజ్ ఇండియన్ ఆటగాళ్లను గ్లోబల్ మార్కెట్‌లో తిరుగులేని బ్రాండ్‌లుగా నిలబెడుతున్నాయి.

## ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు."ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776